# నమస్తే తెలంగాణ
# మెదక్
I | హైదరాబాద్, బుధవారం 2 ఏప్రిల్ 2025 | MEDAK


## తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

- కందిలో 10 రోజులుగా నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు
- బతికేదేలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు
- గ్రామ పంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా



కంది గ్రామ పంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

కంది, ఏప్రిల్ 1: కందిలో పదిరోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కిలోమీటర్ల మేర వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల పేరుతో మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోయిందని, నాలుగు బోర్లున్నా వాటికి మోట ర్లు కరువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, మహిళలు మంగళవారం రోడ్డెక్కారు. కంది పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీబిందెలతో బైఠాయించి ధర్నా చేపట్టారు. పది రోజులుగా తాగేందుకు, వాడుకోవడానికి నీళ్లు లేక నరక యాతన పడుతున్నామని వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా లేక ఉగాది, రంజాన్ పండుగలకు నానా తిప్పలు పడ్డామని, స్నానాలు కూడా చేయలేని పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. పాత కందిలో నాలుగు బోర్లున్నా వాటి మోటర్లు పనిచేయడం లేదన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని సంబంధిత పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. జిల్లా, మండల అధికారులు స్పందించి ఉన్న బోర్లకు వెంటనే మోటర్లు బిగించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

**ఒక బోరుకు మరమ్మతులు**

కందిలో నెలకొన్న నీటి ఎద్దడిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామ మహిళలు ఖాళీబిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగడంతో అధికారులు స్పందించి ఒక బోరుకు మరమ్మతులు చేపట్టారు. పాత కందిలో ఉన్న నాలుగు బోర్లకు, ఒక దానికి మాత్రమే అప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించారు. కంది తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య 3వ వార్డులో బోరుకు మరమ్మతులు చేయించి ఆ వార్డుకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేయించి సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీనిచ్చారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

## హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

కల్హేర్, ఏప్రిల్ 1: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని కొత్త చెరువు తండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త విస్లావత్ హరిసింగ్(50) హత్య కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉగాది పండుగ రోజు రాత్రి హరిసింగ్ చనిపోయారు. ఆయన్ను హత్య చేశారా లేదా సాధారణ మరణమా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కొన్ని ఆధారాలను సేకరించి పోమ్యానాయక్ తండాకు చెందిన సీతారామ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, కొత్త చెరువు తండాకు చెందిన గణపతి పేరు బయట పడడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. మృతుడి భార్య పిప్లిబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇద్దరిని అరెస్టు చేసి నారాయణఖేడ్‌లోని మున్సిఫ్ కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు. కాగా, విస్లావత్ హరిసింగ్ హత్య రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. విస్లావత్ హరిసింగ్ బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేసేవాడు. పార్టీ అధినేత కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీని ఎవరూ విమర్శించినా దీటుగా సమాధానం చెప్పేవాడు. హత్యకు గురైన రోజు ఆదివారం ఉదయం కల్హేర్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో పాటు అంబలి కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్నాడు. ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొని మళ్లీ కేసీఆర్ వస్తాడు, అప్పుడు మంచిరోజులు వస్తాయని అందరితో చెప్పాడు.

## ప్రజావాణి.. పరిష్కారమేదీ!


మెదక్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు హాజరై దరఖాస్తులు ఇవ్వడం, అధికారులు వాటిని స్వీకరించడం మామూలై పోయింది. ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొని అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. కానీ, ఆయా శాఖల అధికారులు మాత్రం వేగంగా పరిష్కరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తుల స్టేటస్ తెలియకపోవడంతో ప్రజలు మళ్లీ మళ్లీ అర్జీలు ఇస్తున్నారు. ఇది ప్రజలకు వ్యయప్రయాసంగా మారింది.



మెదక్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

### అటకెక్కిన ప్రజావాణి అర్జీలు

- మెదక్ కలెక్టరేట్‌లో ఏడాదిగా 1167 దరఖాస్తులు పెండింగ్
- కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితులు
- సమస్య పరిష్కారానికి నోచుకోక మళ్లీమళ్లీ దరఖాస్తులు
- తక్షణ పరిష్కారంపై యంత్రాంగం నిర్లక్ష్యం



మెదక్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): మెదక్ కలెక్టరేట్‌లో 'ప్రజావాణి' కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎన్నిసార్లు దరఖాస్తులు ఇచ్చినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని అర్జీదారులు(బాధితులు) వాపోతున్నారు. ప్రధానంగా ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. గతేడాది జనవరి 1 నుంచి ఈ ఏడాది మార్చి 18 వరకు 1167 దరఖాస్తులు(అర్జీలు) పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుదారులు తమ సమస్య పరిష్కారం కోసం ఇచ్చిన అర్జీలు పరిష్కారానికి నోచుకోక పోవడంతో, మళ్లీ అదే సమస్యపై ప్రజావాణిలో దరఖాస్తు చేస్తున్నారు. దీంతో బాధితులకు వ్యయప్రయాసలు తప్ప డం లేదు.

**పెండింగ్‌లో 1167 దరఖాస్తులు...**

2023 జనవరి 1 నుంచి ఈ సంవత్సరం మార్చి 18 వరకు మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయా శాఖలకు 5657 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 4490 పరిష్కారం కాగా, 1167 పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని శాఖలకు సంబంధించి దరఖాస్తులు అసలే పరిష్కారం కాకపోవడం గమనార్హం. సివిల్ సప్లయ్ కార్యాలయంలో 68 దరఖాస్తులు రాగా, 28 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇందులో 40 దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారు. కలెక్టరేట్‌లోని హెచ్ విభాగంలో 103 దరఖాస్తులు రాగా, 58 మాత్రమే పరిష్కారం కాగా, 45 పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టరేట్ డీ విభాగంలో 938 దరఖాస్తులు రాగా, 867 పరిష్కారం కాగా, 71 పెండింగ్‌లో పెట్టారు. డీఆర్‌డీవోలో 404 దరఖాస్తులు స్వీకరించగా, 310 పరిష్కారం కాగా, 94 పెండింగ్‌లో ఉన్నాయి. ఇకపోతే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో 40 దరఖాస్తులు రాగా, ఒక్క దరఖాస్తు కూడా పరిష్కరించలేదు. లేబర్ కార్యాలయంలో 18 దరఖాస్తులు రాగా, ఒక్క దరఖాస్తు కూడా పరిష్కారానికి నోచుకోలేదు. మెదక్ ఎంపీడీవో కార్యాలయంలో 24 దరఖాస్తులు రాగా, ఒక్క దరఖాస్తు మాత్రమే పరిష్కరించారు. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో 186 దరఖాస్తులు రాగా, 128 పరిష్కరించగా, 58 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. చేగుంట తహసీల్ కార్యాలయంలో 147 రాగా, 112 పరిష్కరించి, 35 పెండింగ్‌లో ఉంచారు. ఇలా ప్రతి శాఖలో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పెండింగ్‌లో ఉన్నాయి.

### ప్రతివారం కిటకిటలాడుతున్న ప్రజావాణి..

మెదక్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్, అన్ని శాఖల అధికారులు పాల్గొంటున్నారు. ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు ఇస్తున్నా, అవి పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు మళ్లీ కలెక్టరేట్‌లోని ప్రజావాణికి హాజరై ఉన్నతాధికారులకు సమస్య చెబుతున్నారు. దీంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి ప్రజలతో కిటకిటలాడుతోంది. వందల సమస్యలు ఈ ప్రజావాణికి వస్తున్నాయి. కొన్నింటిని ఇక్కడ వెంటనే పరిష్కరిస్తున్న ఉన్నతాధికారులు, క్షేత్ర స్థాయిలో పరిష్కరించాల్సిన వాటిని ఆయా మండలాలకు పంపుతున్నారు. అక్కడికి వెళ్లిన దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం లేదు. దీంతో బాధితులు మళ్లీమళ్లీ కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తున్నారు.

## సారూ.. మాకు రుణమాఫీ వర్తించదా

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సత్తు అశోక్ రెడ్డి ఆవేదన



దండంపెట్టి వేడుకుంటున్న రైతు అశోక్‌రెడ్డి

రాయపోల్, ఏప్రిల్ 1: సారూ.. మాకు పంట రుణమాఫీ ఎప్పుడు వస్తుంది. అందరికీ పంట రుణమాఫీ అయ్యింది అంటున్నారు. మాకు ఎందుకు కావడం లేదంటూ సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సత్తు అశోక్‌రెడ్డి మంగళవారం తన ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కాంగ్రెస్‌లో మొదటి నుంచి పనిచేస్తున్నానని, అయినప్పటికీ తనకు రుణమాఫీ వర్తించలేదని ఆయన పేర్కొన్నారు. రూ.2 లక్షలకు పైగా ఉన్న లోన్ డబ్బులు కట్టేశానని, మిగతా రెండు లక్షల రుణమాఫీ రాలేదని అశోక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ప్రభుత్వానిదా..? లేక బ్యాంకర్లదా..? ఏమి అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అందరికీ రుణమాఫీ జరిగిందని ప్రచారం చేస్తున్నారని, కానీ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అయిన తనకు రుణమాఫీ కాలేదన్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి విసిగెత్తి పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు లక్షల రుణమాఫీ చేయకపోవడం తనకు నిరాశ కలిగించిందని, తమ తోటి రైతులకు లక్షా 95 వేలు వరకు రుణమాఫీ చేశారని, తనకు రెండు లక్షల రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకూ రెండు లక్షల రుణమాఫీ చేయాలని ఆయన కోరాడు. ఇదే విషయమై సంబంధిత ఏవోను అడిగితే ప్రాసెస్‌లో ఉందని, రుణమాఫీ వస్తుందని జవాబు ఇస్తున్నారని అశోక్‌రెడ్డి పేర్కొన్నాడు.


## ఎడమ కాలువ కింద ఎండిన పంటలు

### రంగనాయక సాగర్ ఆయకట్టు రైతులకు అందని సాగునీరు

సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో బాలరాజు అనే రైతు తన వ్యవసాయ బావిలో భూగర్భ జలాలు అడుగంటడం తో క్రేన్ సహాయంతో పూడిక తీత



సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో ఎండిన వరిపంటను చూపుతున్న రైతులు



- వందలాది ఎకరాల్లో ఎండిపోయిన పొలాలు
- బావుల పూడిక తీయిస్తున్న రైతులు



సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్‌లో బొప్పెన మల్లయ్యకు చెందిన ఎండిన వరిపొలం

సిద్దిపేట, ఏప్రిల్ 1: సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరందక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు వేసవి ఎండల తీవ్రతతో పొలాలు ఎండిపోయాయి. రంగనాయక సాగర్ ఎడమ కాలువకు నీళ్లు వదిలితే పంటలు గట్టెక్కేవని , నీళ్లు వదలాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడంతో పంటలు ఎండిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రంగనాయక సాగర్ ఎడమ కాలువ కింద సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్‌లో సుమారు 60 వరకు ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. బీఆర్‌ఎస్ హయాంలో పుష్కలంగా నీటిని వదిలిన అధికారులు, ఇప్పుడు రంగనాయక సాగర్ నీటిని మాచాపూర్‌కు వదలక పోవడంతో కెనాల్ పక్కనే ఉన్నా పంట పొలాలు ఎండిపోతున్నాయి. గ్రామంలోని బోయినీ(బతుకమ్మ) చెరువును నింపితే తమ బోరుబావుల్లో పుష్కలంగా నీరు వచ్చేవని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలోకి నీటిని వదిలి చెరువును నింపితే కొద్దిపాటి పంటలైనా దక్కుతాయని రైతులు తెలిపారు.



మాచాపూర్‌లో కాలిపోయిన బోరుమోటరును తీస్తున్న రైతులు



సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్‌కు నీళ్లు వచ్చే రంగనాయక సాగర్ కెనాల్ దుస్థితి

### ఎకరంన్నర పొలం ఎండింది..



యాసంగిలో నాలుగెకరాల్లో వరి నాటుపెట్టిన. ఇప్పటికే ఎకరం 20 గుంటల పొలం ఎండింది. పది రోజులు నీళ్లు ఉంటే పొలం మొత్తం పండేది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలువ ద్వారా నీళ్లు మంచిగ ఇచ్చింది. ఈసారి నీళ్లు వదలాలని ఎన్నిసార్లు అధికారులను అడిగినా వదలడం లేదు. 50 వేల రూపాయల పెట్టుబడి పెట్టి మునిగినం. రంగనాయక సాగర్ ఎడమ కాలువ నీటిని వదిలితే ఉన్న కొద్ది పంటన్నా పండుతది.

– గంద్యడపు శ్రీనివాస్, రైతు, మాచాపూర్ (సిద్దిపేట జిల్లా)

### రెండెకరాల్లో పంట ఎండుతున్నది..



రెండెకరాల్లో వరినాటు పెట్టినం. వరి పొట్టకొచ్చే దశలో ఉంది. ఒక 15 రోజులు నీళ్లు ఉంటే పంట పండేది. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయాక పంట ఎండిపోతున్నది. వరుస తడులు పెడుతున్నా నీళ్లు ఏ మూలకు సరిపోతలేవు. నేను డ్రైవర్‌గా పనిచేస్తా. పంట ఎండిపోతుండడంతో వరుస తడులు పెట్టడం కోసం డ్రైవర్ పని బంద్‌చేసి పొలం చుట్టే ఉంటున్న. అయినా పొలం ఎండి పోతూనే ఉన్నది. రోజు ఒక మూల చొప్పున రెండెకరాలు ఎండింది. గతంలో రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా నీళ్లు రావడంతో పంటలు మంచిగ పండించుకున్నం. ఈ పసలుకు కాలువల నీళ్లు లేకపోవడంతో పంటలు ఎండుతున్నయి.

– మేకల సంజీవరెడ్డి, రైతు, మాచాపూర్ (సిద్దిపేట జిల్లా)

## ప్రజా సంక్షేమానికి పెద్దపీట

**బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్‌లో సన్నబియ్యం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 1: పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, సన్నబియ్యం పథకం చరిత్రలోనే నిలిచిపోతుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని బేడబుడిగ జంగాల కాలనీలో మంగళవారం సన్నబియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో మొదటిసారి సన్నబియ్యం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలోని 17,263 రేషన్ దుకాణాల ద్వారా 2,91,000 లక్షల కుటుంబాలకు సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసేందుకు పావలా వడ్డీని సైతం ప్రభుత్వమే అందిస్తున్నదని, విద్యార్థులకు సైతం కాస్మోటిక్స్ చార్జీలు, మెస్‌చార్జీలను సైతం పెంచిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని అయన అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో రామమూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బంక చందు, తహశీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**గ్యాస్ డబ్బులు వస్తలేవు సార్...**

సన్నబియ్యం పథకం ప్రారంభ కార్యక్రమంలో రెండు వందల యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వస్తుందా అని మంత్రి పొన్నం ప్రభాకర్ సభికులను అడిగారు. సార్.. గ్యాస్ డబ్బులు వస్తలేవు అంటూ హుస్నాబాద్ పట్టణానికి చెందిన చింతల లలిత అనే మహిళ అడిగింది. దీంతో స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గ్యాస్ డబ్బుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అయినప్పటికీ గ్యాస్ డబ్బులు వచ్చేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## చిరువ్యాపారులకు చింత!

### అసంపూర్తిగా 'గ్రామీణ సంత' నిర్మాణాలు

- బిల్లులు రాక మధ్యలోనే నిలిచిన పనులు
- షాపుల కోసం చిరువ్యాపారుల ఎదురు చూపులు



మద్దూరులో మధ్యలోనే నిలిచిపోయిన గ్రామీణ సంత (షాపింగ్ కాంప్లెక్స్) నిర్మాణాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 1: గ్రామీణ ప్రాంతాల్లో చిరు వ్యాపారులకు జీవనోపాధిని కల్పించాలనే సదుద్దేశంతో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామీణ సంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో 2021లో గ్రామీణ సంత(షాపింగ్ కాంప్లెక్స్) నిర్మాణానికి ఈజీఎస్ కింద రూ. 10లక్షలు మంజూరు చేసింది. ఈజీఎస్ నిధులకు తోడుగా స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ నిధుల నుంచి రూ. 10లక్షలు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ. 5లక్షలు ఖర్చు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం రూ.25లక్షల నిధుల ప్రతిపాదనలతో అప్పటి గ్రామ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రూ. 15లక్షల వరకు నిర్మాణ పనులకు ఖర్చు చేశారు. ఈజీఎస్ నుంచి మాత్రమే అధికారికంగా నిధులు మంజూరయ్యాయి. మిగతా ఎమ్మెల్యే, కలెక్టర్, గ్రామ పంచాయతీ నిధులు మంజూరు కాకపోవడంతో పాటు ఈజీఎస్ నిధులు పూర్తిగా రాకపోవడంతో సర్పంచ్ గ్రామీణ సంత నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేశారు. అదనపు నిధుల కోసం ప్రభుత్వంలోని పెద్దలను కలిసిన ప్రయోజనం లేకపోవడంతో సంత నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

**చిరువ్యాపారుల ఇబ్బందులు**

మద్దూరు మండల కేంద్రంలో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేందుకు షాపులు లేకపోవడంతో ఆరుబయట, కిరాయి షాపుల్లో తమ వ్యాపారాలు చేసుకుంటూ చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తే వీరికి ఎంతో మేలు జరుగుతుంది. దీనికి తోడు గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వం నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నం



జీవనోపాధి కోసం తమ కుల వృత్తి అయిన డ్రైక్లీనింగ్, లాండ్రీ పనిచేస్తున్నాను. దీనికోసం ఓ అద్దె షాపును కిరాయికి తీసుకున్నా. ఊరిలో పని దొరికేదే అంతంతమాత్రంగా ఉంటే కిరాయి మాత్రం నెలనెలా కట్టాల్సి వస్తున్నది. కిరాయి కట్టడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు తొందరగా పూర్తి చేస్తే నాలాంటి చిన్న వ్యాపారాలు చేసుకునేవాళ్లకు ఎంతో మేలు జరుగుతుంది.

– పిడిశెట్టి రాజు, ల్యాండ్రీ షాపు నిర్వాహకుడు, మద్దూరు

### నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం



మద్దూరులో చేపట్టిన గ్రామీణ సంత(షాపింగ్ కాంప్లెక్స్) నిర్మాణ పనులు నిధులు లేక ఆగిపోయాయి. అందుబాటులో ఉన్న ఈజీఎస్ నిధులు పూర్తి స్థాయిలో ఖర్చు చేశాం. అదనంగా కావాల్సిన నిధుల కోసం వివిధ మార్గాలను అన్వేసిస్తున్నాం. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైతే ఈ నిర్మాణ పనులకు వాటిని వెచ్చించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. నిధులు సమీకరించి, నిర్మాణ పనులపు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– సోమిశెట్టి రామ్మోహన్, ఎంపీడీవో మద్దూరు